క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

సింగిల్ విండో చైర్మన్ బక్కన్న యాదవ్



క్రీడలను ప్రారంభిస్తున్న బక్కన్న యాదవ్

షాద్‌నగర్: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలూ అంతే ముఖ్యమని సింగింగ్ విండో చైర్మన్ బక్కన్న యాదవ్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని రాయికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ క్రీడలను బక్కన్న యాదవ్, సర్పంచ్ కృష్ణయ్యలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభా పాటవాలను వెలికి తీసి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



ఉప ముఖ్యమంత్రికి పూలబొకేను అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సోమవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకేను అందజేసి అభినందనలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొయినాబాద్: మొయినాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ గేటు, జేబీఐటీ, ఎనికేపల్లి ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ రాజేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మొయినాబాద్-2 ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్‌పీఎస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

మొయినాబాద్ మండలంలో..

మండల పరిధిలోని కనకమామిడి, కేతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా కనకమామిడి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎస్‌వీ కాలేజ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, తోలుకట్ట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ పరఫరా ఉండదన్నారు. కనకమామిడి, నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి, తోలుకట్ట, ఎస్‌వీ కాలేజ్ ప్రాంతాల రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దాతల సహకారం మరువలేనిది

ఎంఈఓ మనోహర్



యూనిఫాంలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కేశంపేట: విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని మండల విద్యాధికారి మనోహర్ అన్నారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మనోహర్ చేతుల మీదుగా యూనిఫాంలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంగా చదవాలని అన్నారు. ఉన్నత చదువులు చదివి గ్రామానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులకు యూనిఫాం అందించడంపై పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్, మండల నోడల్ అధికారి చంద్రశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల సెక్రటరీ రవికుమార్, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, దేవేందర్‌రెడ్డి, ఎంఆర్సీ సిబ్బంది ఎల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఊరూరా జై శ్రీరామ్

ఊరువాడా అంతా రామమయం అయింది. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సోమవారం భక్తులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేవారు. తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల సీతారాముల, హనుమాన్ విగ్రహాలను ఊరేగించారు. ర్యాలీలు, ఊరేగింపులు శ్రీరాముడి నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి రామభక్తిని చాటారు.



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో శ్రీరాముడి విగ్రహం ఊరేగింపు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు



మొయినాబాద్ : రామలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం



కొత్తూరు: హనుమాన్ ఆలయంలో భజనలు చేస్తున్న నాయకులు



చేవెళ్ల మండలంలోని కోర్టు ఆవరణలో..



శంకర్‌పల్లి: శోభాయాత్రలో పాల్గొన్న చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



షాద్‌నగర్‌రూరల్: చౌదమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో



షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్‌లో..



షాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



అజీజ్‌నగర్‌లో..



చేవెళ్లలో శోభాయాత్ర



చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీసీతారాముల శోభాయాత్రను ప్రారంభిస్తున్న భక్తులు



చేవెళ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య



మల్లారెడ్డిగూడ గ్రామంలో శ్రీసీతారాముల విగ్రహాలతో ఊరేగింపు



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి పాదయాత్ర చేస్తున్న అర్చకుడు రంగరాజన్



మొయినాబాద్: పాదయాత్రలో కళాకారుల ప్రదర్శనలు



షాబాద్: తాళ్లపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



సీతారాములను ఊరేగిస్తున్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న గ్రామపెద్దలు, యువకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న షాద్‌నగర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యువత క్రీడల్లో రాణించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన యువకులు ఉన్నారని అన్నారు. క్రీడలతో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. టోర్నీ ఫైనల్ మ్యాచ్ సన్‌రైజర్స్, లక్నో సూపర్ జీయన్స్ జట్లు మధ్య జరిగింది. లక్నో సూపర్ జీయన్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.25వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతితో పాటుగా ఉత్తమ బ్యాట్స్‌మెన్, బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సీరిస్ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొంకళ్ళ చెన్నయ్య, రాజేందర్‌రెడ్డి, అప్పి, బస్వం, పెంటయ్య, రాజుగౌడ్, ప్రవీణ్, అంజద్‌ఖాన్, కబీర్, మతీన్, మహ్మద్, రవితేజ, మనీష్, నర్సింహ్మా, నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటాలి

షాబాద్ సీఐ యాదయ్యగౌడ్

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో మాంటిస్సోరీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడలు శారీరదారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. క్రీడాపోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని, ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఖోఖో, కబడ్డీ, క్యారం బోర్డు తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ జార్జ్ థామస్, కరస్పాండెంట్ మహేశ్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజర్లు, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.



క్రీడాపోటీలు ప్రారంభోత్సవంలో సీఐ యాదయ్యగౌడ్

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

చేవెళ్ల: ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని జిల్లా ఎయిడ్స్ కళాజాత బృందం ఇన్‌చార్జి రామిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం సుంచు లింగయ్య పల్లె సుద్దుల కళాబృందంచే ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ , రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థల సౌజన్యంతో జిల్లా డీఎంహెచ్ఓ సహకారంతో గ్రామాల్లో కళాజాత బృందంచే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి తిరిగి ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు. ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని ఇది సోకిన వారిని దూరంగా పెట్టకూడదని సూచించారు. ఎయిడ్స్‌పై సరైన అవగాహన ఉంటే పూర్తిగా నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఆర్‌జేసీ జిల్లా సూపర్‌వైజర్ బేగరి రాములు, కళాబృందం టీమ్ లీడర్ లింగయ్య, సభ్యులు సైదులు, అంజనేయులు, వీరశ్రీరామ్, వాణి, తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

బీఆర్ఎస్ నాయకులు అహంకారం వీడాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్

కేశంపేట: బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించిన బుద్ధి రావడం లేదని కొత్తూర్, కేశంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సర్పంచ్, ఎంపీటీసీ రాజకీయం చేయాలని చూస్తున్నారని అన్నారు. కొత్తపేట గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా ఎంపీని మండలంలో నిర్వహించిన ఏ కార్యక్రమానికి పిలవకుండా ఇప్పుడే ఎందుకు పిలవాల్సి వచ్చిందని విమర్శించారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులను అవమానించిన బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయిన బుద్ధి మార్చుకోవడం లేదని ఎద్దేవా చేశారు. భవనం అసంపూర్తిగానే ఉందని, అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రారంభోత్సవం ఎలా చేస్తారని మండిపడ్డారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ది అల్పసంఖ్యాక వర్గానికి చెందిన వాడు కావడంతో బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇబ్రహీం, శ్రీధర్‌రెడ్డి, తాండ్ర శ్రావణ్‌రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, రూప్లానాయక్, రాఘవేందర్‌రావు, సాయిలు, ఉస్మాన్, కరుణాకర్‌రెడ్డి, శివయ్య, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇరుకు గదుల్లో ఇక్కట్లు

- వ్యవసాయ కార్యాలయానికి సొంత గూడు కరువు
- ఏళ్ల తరబడిగా అదే భవనంలో కొనసాగింపు

చేవెళ్ల: ఏళ్ల తరబడిగా సొంతభవనానికి నోచుకోకుండా ఓ చిన్న అద్దె భవనం బీడీఓ క్వార్టర్స్‌లో చేవెళ్ల డివిజన్, మండల వ్యవసాయ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఏడాది పొడవునా రైతులతో బిజీగా ఉండే ఈ కార్యాలయానికి సొంత భవనం లేకపోవటం విడ్డూరంగా ఉందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. రైతు వేదికలంటూ వ్యవసాయశాఖకు క్లస్టర్‌ల వారీగా భవనాలు ఏర్పాటు చేశారు. కానీ వ్యవసాయ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయా లేదా అని ఆలోచించటం లేదు. అవసరం లేని కార్యాలయాలకు, సొంత భవనాలు ఉన్నా మళ్లీ కొత్త భవనాలు సైతం మంజూరు అవుతుంటే ఏళ్ల తరబడిగా సొంతభవనం లేని వ్యవసాయశాఖకు మాత్రం డివిజన్ కేంద్రంలో సొంత భవనం లేకపోవడం శోచనీయం. కేవలం రెండు గదుల్లోనే చేవెళ్ల డివిజన్, మండల కార్యాలయాలు కొనసాగిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. రైతులు వస్తే కూర్చునేందుకు కనీస స్థలం కూడా లేదని స్థానికులు వాపోతున్నారు.

చేవెళ్ల మండల కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రం కూడా కావడంతో వ్యవసాయశాఖ డివిజన్, మండల కార్యాలయాలు ఉండటంతో రెండు ఒకే చోట కొనసాగుతున్నాయి. అప్పట్లో సొంత భవనాలు లేకపోవడంతో మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న బీడీఓ క్వార్టర్స్‌ను వ్యవసాయశాఖకు అద్దెపై కేటాయించారు. అప్పటినుంచి నేటి వరకు అదే క్వార్టర్స్‌లోనే ఈ రెండు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింది 2015లోనే చేవెళ్ల వ్యవసాయ కార్యాలయానికి రూ. 40లక్షల భవన నిర్మాణానికి నిధులు మంజూరయినట్లు రికార్డులు ఉన్నా ఈ విషయం మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోలేదు. అదే ఇరుక్కు గదుల్లో పనులు చేసుకుంటూ అధికారులు మౌనంగా ఉండటంతో భవనం మంజూరు విషయం మరుగున పడిపోయింది. కనీసం ఇప్పడైనా ఉన్న అధికారులు స్పందించి అ నిధులతో వ్యవసాయశాఖకు కొంత భవనం నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



చేవెళ్ల మండలకేంద్రంలో ఉన్న వ్యవసాయ డివిజన్, మండల కార్యాలయం కొనసాగుతున్న చిన్న క్వార్టర్స్ ఇదే

రెండు గదుల్లో 11 మంది అధికారులు, సిబ్బంది

డివిజన్ కార్యాలయంలో ఏడీ, ఏఓ టెక్నికల్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఐదు మంది ఉండగా మండల వ్యవసాయ కార్యాలయానికి ఏఓ, ఐదు క్లస్టర్లకు ఐదు మంది ఏఈఓలు మొత్తం 6 మంది పని చేస్తున్నారు. మొత్తం 11 మంది అధికారులు, సిబ్బందికి కూర్చోవడానికి కూడా స్థలం సరిపోవడం లేదు. ఈ క్వార్టర్స్‌ను గతంలో మరమ్మతులు చేయించి ఖాళీ స్థలాన్ని సైతం ఉపయోగించుకుంటూ డివిజన్, మండల కార్యాలయాలను కొనసాగిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మండలంలో అవసరం లేని చిన్న చిన్న కార్యాలయాలకు సైతం సొంత భవనాలు ఒక్కటి రెండు చొప్పున ఉన్నాయి. నిత్యం రైతులకు అవసరం ఉండే వ్యవసాయశాఖకు మాత్రం సొంత భవనం లేకపోవడం విడ్డూరంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు కళ్ల ముందు కనిపిస్తున్న ఈ కార్యాలయానికి భవనం మాత్రం మంజూరు చేయడం లేదు. –నర్సింలు, రైతు, ఆలూరు

సొంత భవనం లేదు..



చేవెళ్ల డివిజన్ అధికారిగా వచ్చిన నాటి నుంచి ఈ పాత కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నాం. మండల కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. గదులు సరిపోవడం లేని మాట వాస్తవమే. 2015లోనే సొంత భవనానికి నిధులు మంజూరైనట్లు రికార్డులో ఉంది కానీ, అప్పట్లో ఎందుకు కట్టలేదో తెలియదు. కార్యాలయం భవనం కావాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. మండల డివిజన్ కార్యాలయాలు రెండు ఒకేచోట కొనసాగుతున్నాయి. సొంత భవనం ఉంటే అధికారులు, సిబ్బందికి, రైతులకు బాగుంటుంది. –రమాదేవి, ఏడీఏ ,చేవెళ్ల డివిజన్